క్లుప్తంగా

స్పందన వినతులపై దృష్టి పెట్టండి


ఫిర్యాదులు అందుకుంటున్న తహసీల్దార్ లోకనాథపిళ్లై

శ్రీరంగరాజపురం : స్పందనలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని మండల తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి 17 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 09, శ్మశానానికి దారి 3, డీకేటీ పట్టా కేటాయించాలని 05 వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందనకు వచ్చే సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమానికి రెవెన్యూసిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్‌గా ధనసింగ్


నియామక పత్రం అందుకుంటున్న ధనసింగ్

నగరి : స్వచ్ఛభారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్‌గా డీబీ ధనసింగ్ నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ చిత్తూరు వారి ఉత్తర్వుల మేరకు సోమవారం ఎంపీడీఓ లీలామాధవి నుంచి నియామక పత్రాన్ని ఆయ న అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సాక్షర భారత్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని 2018లో అప్పటి ప్రభుత్వం తొలగించిందన్నారు. ప్రస్తుత ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి గతంలో పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ–2లో తిరిగి భాగస్వామ్యులను చేస్తూ అవుట్ సోర్సింగ్ ద్వారా మండల రిసోర్స్ కోఆర్డినేటర్లుగా నియమించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీరు, పారిశుద్ధ్యం నిర్వహణపై అవగాహన కల్పిస్తానన్నారు.

నింద్ర కోఆర్డినేటర్‌గా అరుణాచలం



నింద్ర: మండల స్వచ్ఛభారత్ కో–ఆర్డినేటర్‌గా అరుణాచలంను నియమించినట్లు ఎంపీడీఓ అరుణ తెలిపారు. జిల్లా కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయినట్లు ఆమె వెల్లడించారు. మండలంలో వీరు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి వనరుల పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు.

సమాజానికి పవన్‌కల్యాణ్ హానికరం

- ప్యాకేజీ స్టార్ లాంటి చీడపురుగులను ఏరి వేయాలి
- పవన్‌కల్యాణ్ తక్షణం బహిరంగ క్షమాపణలు చెప్పాలి
- లేదంటే వారాహిని అడ్డుకుంటాం
- జనసేన అధినేత పవన్ వ్యాఖ్యలపై వలంటీర్లు ఆగ్రహం
- పుత్తూరులో పీకే దిష్టిబొమ్మ దగ్ధం


పుత్తూరులో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ క్యాండిళ్లతో మానవహారం ఏర్పాటు చేసిన వలంటీర్లు

పుత్తూరు రూరల్: దత్తపుత్రుడు.. ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ డౌన్‌డౌన్ అంటూ వలంటీర్ల నినాదాలతో పుత్తూరు పట్టణం దద్దరిల్లింది. ఏలూరు బహిరంగ సభలో పవన్‌కల్యాణ్ వలంటీర్లు ఇళ్ల వద్దకు వెళ్లి వితంతువులు, అడ్రస్సులు సేకరించి హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నట్లు చెప్పడం పట్ల వలంటీర్లు నిప్పులు చెరిగారు. దత్తపుత్రుడు పాత్ర పోషిస్తూ, ప్యాకేజీలు తీసుకుని మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్ తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారాహియాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద పెద్దసంఖ్యలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది క్యాండిల్ ర్యాలీతో నిరసన వ్యక్తం చేసి, పవన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ అనే వ్యక్తి సమాజానికి చీడపురుగు వంటి వాడని, ఇలాంటి వారిని ఏరి వేయాలన్నారు. కరోనా సమయంలో హైదరాబాద్‌లో దాక్కున్న దత్తపుత్రుడు వలంటీర్ల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజలకు సేవ చేసిన ఘనత వలంటీర్లదేనని తెలిపారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడకపోతే తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కనీసం ఎమ్మెల్యేగా గెలవలేని పవన్‌కల్యాణ్‌కు కేంద్రవర్గాలు సమాచారం ఇచ్చాయంటే నమ్మే స్థితిలో ఎవరూ లేరని స్పష్టం చేశారు. పవన్ తక్షణం వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అలాగే మండలకేంద్రం వడమాలపేటలో వలంటీర్లు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.


పాలసముద్రం సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వలంటీర్లు

మేము బానిసలు కాదు.. సేవకులం

పాలసముద్రం : మేము బానిసలుగా కాదు.. ప్రజలకు సేవకులుగా పని చేస్తున్నాం’ అని వలంటీర్లు తెలిపారు. సోమవారం వారు పాలసముద్రం గ్రామ సచివాలయం ఎదుట ధర్నా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు బానిసలుగా బతుకుతున్నారని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఖండించారు. నోరు అదుపులో పెట్టాలని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం ప్రజాసేవలో పరితపిస్తున్న వలంటీర్లను చులకన చేసి మాట్లాడడం పవన్‌కల్యాణ్‌కు తగదిన, బహిరంగ క్షమాపణలు చెప్పకపోతే భవిష్యత్‌లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

వలంటీర్లతో పెట్టుకోవద్దు



వలంటీర్లతో పెట్టుకుంటే పవన్‌కల్యాణ్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. పక్క రాష్ట్రంలో నివసిస్తూ వారానికి రెండు రోజుల వచ్చి ఇక్కడి ప్రజావ్యవస్థపై ఆరోపణలు చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం. వలంటీర్లను దూషిస్తే, రాబోయే ఎన్నికల్లో ఓటర్లే తగిన బుద్ధి చెబుతారు.

– పీఎస్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

నీ కథ తేలుస్తాం..



మహిళలను కించపరిచే విధంగా మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్.. నీకు మహిళలు అంటే అంతా అలుసా ? వలంటీర్‌గా సేవలు అందిస్తున్న మా మహిళలపై నోరు జారితే నీ కథ తేలుస్తాం. మేము అనుకుంటే రాష్ట్రంలో నువ్వు ఎక్కడా తిరగలేవు. ప్రభుత్వం మహిళలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించి అభివృద్ధికి దోహద పడుతోంది.

– వనిత, అత్తూరు, వలంటీర్, నింద్ర మండలం

అంతా ఆయనలా కామాంధులు కాదు..



ఎలాంటి లాభాపేక్ష లేకుండా సంక్షేమ పథకాలను ప్రజల వద్ద చేరుస్తూ పని చేస్తున్న మా గురించి మాట్లాడే అర్హత పవన్‌కల్యాణ్‌కు లేదు. అందరూ నీలా కామాంధులు అనుకోవడం పొరపాటే. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయం కాక ముందే తలుపు తట్టి వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్లు అందిస్తున్నాం.. కానీ నీ ఉద్దేశాలను మా వలంటీర్లపై రుద్దడం మంచిది కాదు.

– మోహన్‌బాబు, వలంటీర్, కార్వేటినగరం

పవన్‌కల్యాణ్ ఒక ఉన్మాది



రాష్ట్రంలో సుపరిపాలన అందించేందుకు సీఎం జగనన్న వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారు. అర్హులను గుర్తించి వారికి సంక్షేమాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్న మా వలంటీర్ల గురించి తప్పుగా మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్ ఒక ఉన్మాది. వలంటీర్లంటే ప్రభు త్వానికి, ప్రజలకు మధ్య వారధులం. అంతే కానీ అతనిలా మహిళలను వంచించే గుణం మాకు లేదు. వలంటీర్లను విమర్శిస్తే నిన్ను భూస్థాపితం చేస్తాం.

– దేవారెడ్డి, వలంటీర్, కలికిరిండ్లు, కార్వేటినగరం మండలం

ఆయన చదువుకున్న వ్యక్తిలా లేదు..



నిత్యం ప్రజాసేవలో పరితపిస్తున్న మా వలంటీర్లను జనసేన అధినేత పవన్ మాట్లాడిన తీరు చూస్తే చదువుకున్న వ్యక్తిలా లేదు. వలంటీర్లు అంటే గుమాస్తా అనుకున్నావా ! ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి పథకాన్ని ప్రజలకు చేర్చే సైనికులం. గ్రామాల్లో ఇంటింటికి పోయి అడిగితే చెబుతారు మా వలంటీర్లు ఎలా పని చేస్తున్నారో ! నోరు ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే తగిన బుద్ధి చెబుతాం.

– రామ్‌రాజ్, వలంటీరు, కొప్పేడు సచివాలయం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


పథకాల లబ్ధిని తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- పార్టీలకు అతీతంగా ప్రభుత్వ ఫలాలు
- ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలన్నదే లక్ష్యం
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి , జెడ్పీచైర్మన్, ఎంపీ

వెదురుకుప్పం: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని పాతచవటగుంట, సంత బయలు, గుండుపల్లె, సీఆర్‌కండ్రిగ, వెదురుకుప్పం ఎస్టీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు ప్రతి గడప వద్దకు వెళ్లి పథకాల లబ్ధి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తింపజేయాలన్నారు. గ్రామాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సత్యనారాయణను ఆదేశించారు. ఆదేవిధంగా కాలువలు, వంకలు, చెరువులు, శ్మశాన వాటికలు ఆక్రమణలో ఉంటే వెంటనే తొలగించాలన్నారు. అనంతరం జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ఎలాంటి వివక్షత లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి నారాయణ స్వామి కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపడుతున్నా, కొన్ని మీడియా వక్రీకరించి దుష్ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. నిస్వార్థపరుడైన మంత్రి నారాయణస్వామిపై లేనిపోని ఆరోపణలు చేసి అప్రతిష్టపాలు చేయడం బాధాకరమన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మాట్లాడుతూ కల్లిబొల్లి మాటలు నమ్మి సంక్షేమానికి దూరం కావొద్దని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, వైస్ ఎంపీపీ బట్టే రమణసుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంపీటీసీలు మురళీరెడ్డి, మునిచంద్రారెడ్డి, చిన్నబ్బ, భాస్కర్, సర్పంచులు శిల్ప, రాజేశ్వరి, గోవిందయ్య, బాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్ ప్రకాష్, సింగిల్‌విండో చైర్మన్ లోకనాథరెడ్డి, డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీలు పురుషోత్తం, జ్ఞానకొండారెడ్డి, బూత్ కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు..

మండల కేంద్రంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, మంత్రి నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప సంయుక్తంగా ప్రారంభించారు. ముందుగా ఫైర్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. సీఆర్‌కండ్రిగలో సిమెంటురోడ్డు ప్రారంభం, రూ.50 లక్షలతో నిర్మించిన వాణిజ్య సముదాయం, మురుగునీటి, రైతుభరోసా కేంద్రం, 40 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు, మండల కేంద్రంలో మరుగుదొడ్లను వారు ప్రారంభించారు. అలాగే వెదురుకుప్ప ఎస్టీ కాలనీలో నీటి ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అంతకుముందు మహిళలు పెద్దఎత్తున నేతలకు మంగళ హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు నందీశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

12న తలనీలాల వేలం

కార్వేటినగరం: స్కంధపుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై వెలసిన వళ్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక వేడుకల సందర్భంగా తలనీలాల సేకరణకు వేలంపాట నిర్వహిస్తామని ఆలయ అధ్యక్షుడు కే.కేశవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 8 నుంచి 11 వరకు జరిగే ఆడికృత్తిక వేడుకల్లో భక్తులు సమర్పించే తలనీలాల కోసం ఈ నెల 12వ తేదీ స్కంధపుష్కరిణి ఆవరణలో 11 గంటలకు వేలంపాట జరుగుతుందన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు ముందుగా రూ.20 వేలు ధరావత్తు చెల్లించాలని సూచించారు.



13న పుత్తూరులో జాబ్‌మేళా

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, చెన్నైకి చెందిన కాల్ మాస్ సర్వీసెస్ సంస్థ సంయుక్తంగా ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో పాల్గొనేందుకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారితో ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు అర్హులన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.13 వేలు నుంచి రూ.15 వేలు వరకు ఉంటుందని, ఉచిత వసతి సదుపాయం ఉంటుందని వివరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాకు అభ్యర్థులు సర్టిఫికెట్లతో పాటు, ఒరిజినల్ ఐడీ కార్డుతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 7995802325, 9640656775 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి


ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ చేస్తున్న రైతులు

పాలసముద్రం : మండల పరిధిలోని రైతులు ప్రకృతి వ్యవసాయంతో పంటను సాగు చేయడం వల్ల రసాయనాల వాడకం ఉండదని జీవామృతం కాషాయాలతో సాగు చేయడంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చిత్తూరు ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. సోమవారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో రైతులకు సర్పంచ్ గాలి మహేష్‌బాబు సమక్షంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంలో చెరకు పంట సాగు చీడపీడల నివారణ అధిక దిగుబడులు కోసం జీవామృతం వాడకం కలుపు నివారణ కోసం తీసుకోవాలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ ప్రకృతి వ్యవసాయంలో చెరకు పంట సాగు చేసి అందుల్లో బెల్లం తయారీ చేస్తే బెల్లంను తిరుమల–తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తామన్నారు. రైతులకు మార్కెట్ ధర కన్నా ఐదుశాతం ఎక్కువ టీటీడీ కొనుగోలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో వేస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం వెంగళరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పప్పు, కూరగాయలు, వంటివి గుడ్లు ప్రతిరోజు సక్రమంగా పెట్టాలని తెలిపారు. తాజా కూరగాయలు తప్పక వాడాలి. హెచ్ఎం విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో త్వరగా పెట్టాలని తెలిపారు. ఆయన వెంట హెచ్ఎం చక్రాధరరావు ఉన్నారు. అనంతరం విద్యార్థులకు వేస్తున్న భోజనాన్ని పరిశీలించారు.





అర్హులకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం


ధ్రువీకరణ పత్రాలు అందుకున్న వారితో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి : జగనన్న సురక్ష కార్యక్రమంలో పల్లె, పట్టణాల్లో అర్హులైన వారికి మేలు చేయడమే లక్ష్యమని మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం నగరి మున్సిపాలిటీ సత్రం కండ్రిగ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగ నన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హులైన 433 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వీటిలో కులధ్రువీకరణ పత్రాలు 194, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 192, అదనపు పేర్లతో బియ్యం కార్డులు 21, బియ్యం కార్డుల విభజన 4, కొత్త బియ్యం కార్డులు 4, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికేటు 1, ఆరోగ్యశ్రీ కార్డు 1, హౌస్‌హోల్డ్ స్ప్లిట్1, ఆధార్ మొబైల్ అప్డేట్ 15 ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డుల్లో మార్పులు వంటివి చాలా సులభతరం చేస్తూ ప్రభుత్వ వ్యవస్థను ప్రజల చెంతకు చేరవేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, ప్రత్యేక అధికారి శోభన్‌బాబు, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు భారతి, దేవరాజులు, ఏరియా ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కాలభైరవుడికి చందన అలంకరణ సేవ


చందన అలంకరణలో కాళభైరవ స్వామి

నగరి : పట్టణ పరిధిలోని శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలోని శ్రీ కాలభైరవ స్వామివారికి సోమవారం అష్టమి పూజల్లో భాగంగా చందన అలంకరణ చేశారు. ఈ అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అష్టమి పూజలను పురస్కరించుకుని కాలభైరవ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. స్వామివారికి పాలు, పెరుగు పంచామృతంతో అభిషేకం చేశారు. అనంతరం చందన అలంకరణ చేయగా భక్తులు స్వామివారిని దర్శించుకుని విభూది ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు.



